క్లుప్తంగా

జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకన్నయాదవ్

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన దాసరి వెంకన్నయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు వెంకన్నయాదవ్‌కు గురువారం సంఘం అధ్యక్షుడు చలమళ్ల నర్సింహ నియామక పత్రాన్ని అందించారు. అనంతరం వెంకన్న యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

బోనాల పండుగ



బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

తిరుమలగిరి: మండలంలోని గుండెపురి గ్రామంలో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి బోనాలలో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

టీజేఎస్ఎస్ అవార్డుకు ఎంపిక

సూర్యాపేట : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో టీజేఎస్ఎస్ ఆధ్వర్యంలో అందించే ఆర్ట్ జర్నల్ నగదు అవార్డుకు సూర్యాపేటకు చెందిన ప్రముఖ ఆర్టిస్ట్, కార్టూనిస్ట్ శిరంశెట్టి ఆనంద్ ఎంపికయ్యారు. ఈ నెల 12న విజయవాడలోని తుమ్మలపల్లి కాలక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో నగదు అవార్డును అందుకోనున్నారు. ఆనంద్ గత 30 సంవత్సరాల నుంచి పత్రికలలో ఆర్టిస్టుగా పని చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఇప్పటికే ఆయనకు 50కి పైగా అవార్డులు లభించాయి.

అనసూర్యమ్మ కుటుంబానికి పటేల్ రమేష్‌రెడ్డి పరామర్శ



నివాళులర్పిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ముత్తినేని అనసూర్యమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్ననాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, వీరమల్లు, వల్దాసు దేవేందర్, కుందూరు వెంకట్‌రెడ్డి, సామసురేందర్, కర్నాకర్‌రెడ్డి, సూదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ధర్మానాయక్, యాట ఉపేందర్ పాల్గొన్నారు.

మైనార్టీలకు రక్షణ కల్పించాలి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మైనార్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని తెలుగు రాష్ట్రాల సువార్త చర్చ్ కో ఆర్డినేటర్ పాస్టర్ సీహెచ్. శ్యామ్ ప్రసాద్ అన్నారు. పట్టణ పరిధిలోని శాంతి నగర్‌లో బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాస్టర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జలగం జేమ్స్, హుజూర్‌నగర్ నియోజకవర్గ గౌరవ సలహాదారులు ఉటుకూరి రాజు, పాస్టర్ సీహెచ్. కిరణ్ కుమార్, పంది మార్క్, బోడ లూకా, డి.జాన్ ప్రకాష్, చింత మనిషే, పీవీ.బోయాజ్, పాస్టర్ కొండేటి లాజర్, ఎం.రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన నాయకులు



డీఎస్పీ పార్థసారథిని కలిసి సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగారం : సూర్యాపేట డీఎస్పీగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్థసారథిని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సూర్యాపేటలోని డీఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాశం యాదవరెడ్డి, కాశీ వెంకటేశ్వర్లు, ఎల్మకంటి సోమన్న, బండగొర్ల జనార్దన్, బోయిని లింగమల్లు, ఈదుల రమేష్‌చంద్ర ఉన్నారు.

తుంగతుర్తి సీఐగా నర్సింహారావు



తుంగతుర్తి: తుంగతుర్తి సీఐగా ఎ.నర్సింహారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా డీఎస్బీలో పనిచేస్తూ బదిలీపై తుంగతుర్తి సీఐగా వచ్చారు. గతంలో ఇక్కడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనునాయక్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు.

దోమలతో కుస్తీ.. ప్రజలకు సుస్తీ

- సూర్యాపేట పట్టణంలో పెరుగుతున్న దోమల బెడద
- అస్తవ్యస్తంగా మురుగు కాలువలు, రోడ్ల వెంబడే చెత్తాచెదారం
- ఫాగింగ్ చేపట్టడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- రోగాలబారిన పడి ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నాలాలో పేరుకపోయిన చెత్త



పుల్లారెడ్డి చెరువులోకి వెళ్లే మురుగు కాలువ

సూర్యాపేట అర్బన్ : పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపం ప్రజలకు శాపంగా మారింది. అపరిశుభ్ర పరిసరాలు, అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా ఎక్కడ చూసినా దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు పట్టణంలోని ప్రతి ఇంటిదగ్గర దోమల వేట మొదలవుతోంది. దోమతెరలు, మెస్ డోర్లు లేనివారు ఇళ్లలో రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పట్టణంలోని చాలా కాలనీల్లో ప్రజలు దోమల వల్ల విష జ్వరాల బారినపడి ఆస్పత్రుల్లో వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వార్డుల్లో ఫాగింగ్ చేపట్టడం లేదు. దీనికితోడు పారిశుద్ధ్య నిర్వహణ సరిగాలేక మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దోమలు వృద్ధిచెందుతున్నాయి.

పట్టణం మొత్తం ఇదే పరిస్థితి..

సూర్యాపేట పట్టణంలో 48 వార్డులు ఉన్నాయి. ముఖ్యంగా అంబేద్కర్ నగర్, భగత్ సింగ్‌నగర్, చర్చి కాంపౌండ్, జమ్మిగడ్డ, కొత్త బస్టాండ్, విద్యానగర్, శ్రీనివాస నగర్, మానస నగర్, శ్రీరామ్ నగర్ వార్డులలో పారిశుద్ధ్య సిబ్బంది సరిగా విధులు నిర్వహించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్యలోపం సమస్య నెలకొంది. రోడ్ల వెంబడే చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇళ్లలోని వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని కొన్ని వార్డుల్లో మురుగు కాలువలే లేవు. మరికొన్ని వార్డుల్లో మురుగు కాలువలు ఉన్నా వాటి నిర్వహణ సరిగా లేక మురుగునీరు సాఫీగా వెళ్లడంలేదు. దీంతో దోమలు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. పట్టణంలో నాలాల దగ్గర నీరు కదలకుండా నిల్వ ఉండడం, చెత్త, ప్లాస్టిక్ గ్లాసులు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు మొదలైన వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేస్తుండడంతో ఆయా ప్రాంతాలు దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ వాహనాల ద్వారా చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించాలని, పట్టణంలోని వార్డుల్లో వారానికి కనీసం రెండు, మూడు సార్లు దోమల పొగ ఫాగింగ్ చేయించాలని పట్టణవాసులు అధికారులను కోరుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేదు



శ్రీనివాస కాలనీలోని డీమార్ట్ సమీపంలో మురుగుకాలువ లేకపోవడంతో ఇళ్లలోని నీరు మొత్తం ఖాళీ స్థలాల్లోకి చేరి నిలుస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మాకు రాత్రింబవళ్లు తేడా లేకుండా దోమలు కరుస్తున్నాయి. అధికారులు స్పందించి మా కాలనీలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలి.

– చిత్తలూరి నరేష్, శ్రీనివాస కాలనీ

సాయంత్రమైతే ఇబ్బందే..



సాయంత్రం అయిందంటే చాలు దోమలు విపరీతంగా వస్తున్నాయి. దీంతో ఇళ్లకు మెస్ డోర్లు వేసుకుంటున్నాం. మా కాలనీలో పందుల బెడద కూడా విపరీతంగా ఉంది. అయ్యప్ప స్వామి ఆలయం లైన్లో గుడి నుంచి మా కాలనీ చివరిదాకా మురుగు నీరు వెళ్లేందుకు కాలువలు లేవు. కాబట్టి మురుగు నీరు ఇళ్ల వెంబడే నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కె.నిఖిల, అయ్యప్పస్వామి టెంపుల్ రోడ్

జాగారం చేయాల్సి వస్తోంది



పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతోంది. అయితే సమీపంలోనే పుల్లారెడ్డి చెరువు ఉండడం, పారిశుద్ధ్య లోపం కారణంగా పరిసర ప్రాంతాల్లో దోమలు విపరీతంగా ఉంటున్నాయి. దీంతో కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చిన వారంతా దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి దోమల కారణంగా జాగారం చేసే పరిస్థితి నెలకొంది.

– మల్లిఖార్జున్, లయన్స్‌క్లబ్ మేనేజర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు సూర్యాపేట టౌన్–1 ఏఈ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు గిరినగర్, హనుమాన్ నగర్, శాంతినగర్, ఈనాడు ఆఫీస్ ఎదురుగా, అయ్యప్ప నగర్, జాకీర్ హుస్సేన్ నగర్, శ్రీరామ్ నగర్, బాలాజీ నగర్, దుర్గామాత సెంటర్, కుడకుడ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్దిరాల : కుక్కడం గ్రామంలో విద్యుత్‌లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచ్ దాయం విక్రమ్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

తుంగతుర్తి : తిరుమలగిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ దాయం విక్రమ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ గురువారం విక్రమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేంధర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తాటికొండ సీతయ్య, దేశబోయిన హరీష్, మట్టపల్లి శ్రీశైలం, గుండగాని రాములుగౌడ్, గోపాల్‌రెడ్డి, తునికి సాయిలు, యాదగిరి, దుర్గయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర



డి.కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నాగారం : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతోందని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల కోఆర్డినేటర్ పానుగంటి నర్సింహారెడ్డి అన్నారు. గురువారం డి.కొత్తపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకట్‌రెడ్డి, జాజుల వీరయ్య, ఎల్మకంటి సోమన్న, ఆకుల ప్రతాప్, కన్నెబోయిన వెంకటభిక్షం, కొండ మల్లేష్, నగేష్, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచాంపూలాల్ జాతర



పూజలు చేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

చివ్వెంల : మండల పరిధిలోని పులితండా గ్రామంలో శ్రీచాంపూలాల్ స్వామి జాతర జరుగుతోంది. రెండు రోజులపాటు జరిగే జాతరకు మొదటిరోజు గురువారం భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. జాతరకు సూర్యాపేట జిల్లా నుంచే కాకుండా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా గిరిజనులు వేలాదిగా తరలివస్తున్నారు. ట్రాక్టర్లు, డీసీఎం, ఆటోలలో వచ్చి గుడిచుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

హాజరైన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి..

జాతరకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రౌతు నర్సింహారావు, ధరావతు కుమారి బాబు నాయక్, నెమ్మాది భిక్షం, మాజీ సర్పంచ్‌లు ధరావతు సుజాత, గుగులోతు కవిత పాల్గొన్నారు.

పూజలు చేసిన పటేల్ రమేష్ రెడ్డి

శ్రీచాంపూలాల్ జాతరలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రుగొండ ఆలయ అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పూర రామ్మూర్తి, వెన్న నర్సిరెడ్డి, గోగుల ఈదయ్య, ధరావతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : పూజలు చేస్తున్న రమేష్ రెడ్డి



జాతరకు హాజరైన భక్తులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట అర్బన్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్



తిరుమలగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

సూర్యాపేట అర్బన్ : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్ శ్వేత అన్నారు. పట్టణ పరిధిలోని 4వ వార్డు దుబ్బతండాలో గురువారం ఎస్ఎల్ఎఫ్ 2 ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 11 ఐకేపీ కేంద్రాలకు గాను ఇప్పటికే ఆరు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఓ ఉమారాణి, ఐకేపీ కేంద్ర నిర్వాహకులు ధరావత్ నాగు నాయక్, ఆర్పీ ఎల్లోరా, వాల్యా నాయక్, పీకా నాయక్, వెంకన్న నాయక్, మోతీలాల్ నాయక్, తులసి రామ్, భిక్షం, చారి, పాండు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి, తాటిపాముల గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.హరిప్రసాద్, ఏఓ నాగేశ్వరరావు, నాయబ్ తహసీల్దార్ జాన్ మహమ్మద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

అర్వపల్లి : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో ఉమామహేశ్వర రైతు ఉత్పత్తుల మార్కెటింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, కృష్ణమూర్తి, నర్సింగ వెంకటేశ్వర్లు, బాబూరావు, రైతు సంఘం అధ్యక్షుడు గౌని వెంకన్న, వల్లాల రమేష్, వీరసోములు, మధు, సుదర్శన్, రాంమల్లు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని తహసీల్దార్ లాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో, గాజులమల్కాపురం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, ఏఓ అనిల్‌కుమార్, సీఈఓ సోమ్లానాయక్, డైరెక్టర్ గుడిపూరి రవి, తూముల ఇంద్రసేనారావు, ఏఈఓ స్వప్న, శ్రీను, సైదులు, వెంకన్న, గోపి, లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

నాగారం : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలని ఏపీఎం శోభారాణి అన్నారు. గురువారం ఫణిగిరి, పసునూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకట్‌రెడ్డి, పాదిల నరేష్, పానుగంటి నర్సింహారెడ్డి, ఏగూరి మంజుల, ఎల్మకంటి సోమన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

మద్దిరాల : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడవెల్లి, కుక్కడం, మద్దిరాల, ముకుందాపురం, జి.కొత్తపల్లి, చందుపట్ల, రామచంద్రపురం, చిన్ననెమిల గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో, రెడ్డిగూడెంలో ఎఫ్‌పీఓ, మద్దిరాలలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి వెంకన్న, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనిషారూహి, ఏపీఎం మైసయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు చిల్పకుంట్ల, సోమ్లాతండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, సీఈఓ సమ్మెట వెంకన్న, గుగులోతు కృష్ణ, బత్తుల నాగమల్లు, బాణాల సుదర్శన్‌రెడ్డి, పంతం వెంకన్న, బాణాల మల్లారెడ్డి, బంటు బద్రి, ఇమ్మారెడ్డి మహేష్, ఏర్పుగొండ సురేష్, చిత్తలూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చెవిటి వెంకన్న యాదవ్



పెన్‌పహాడ్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ లాలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు బత్తిని విష్ణుమూర్తి అన్నారు. గురువారం పసునూర్ ప్రాథమిక, జెడ్పీహెచ్ఎస్‌ల ఆధ్వర్యంలో బడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం బింగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు హరికిషన్, శివకుమార్, విజయలక్ష్మి, శోభారాణి, కళమ్మ, వెంకన్న, సత్యనారాయణ, జిలాని, శ్రీదేవి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మజ్జిగ సూర్యకాంతం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెంలో బడిబాట

అర్వపల్లి : 2025–26 విద్యాసంవత్సరంలో పిల్లల ప్రవేశానికై జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ఎంఈఓ బాలు నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం ఇందిర, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన

మద్దిరాల : కార్పొరేట్‌కు దీటుగా పోలుమల్ల పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు జహీర్ తెలిపారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారు



నూతన కమిటీని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. పర్సాయపల్లి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన మిర్యాల వెంకన్నతోపాటు నూతన కమిటీని గురువారం అర్వపల్లిలో అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, కొప్పుల భరత్ రెడ్డి, పందిరి యుగంధర్, బొద్దు రామలింగయ్య, రాచకొండ గీతాసురేష్, తోట నర్సయ్య, అంకిరెడ్డి లింగయ్య, సురేష్, శ్రీను, వెంకన్న, ప్రభాకర్, సైదులు, కృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

తిరుమలగిరి : పోషణపక్షంలో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటీ 8వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ శ్రీజ గురువారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ, ఏఎన్ఎం బేబీ, అంగన్వాడీ టీచర్లు ధనమ్మ, వెంకటమ్మ, ఆశ వర్కర్ దసరమ్మ, అంగన్వాడీ హెల్పర్ సునీత పాల్గొన్నారు.

కూల్‌వాటర్ ఏర్పాటు

అర్వపల్లి: వేసవి దృష్ట్యా కార్యాలయానికి వచ్చే ప్రజలకు కూల్ వాటర్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు చెప్పారు. అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రజలకు కూల్‌వాటర్ పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో గిర్దావర్ వెంకట్‌రెడ్డి, సీఓ ఖమ్మంపాటి సైదులు, వజ్జె సైదయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోషకాహారంతో రక్తహీనత నివారణ

సూర్యాపేట అర్బన్ : సరైన పోషకాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని అంబేద్కర్ నగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రమ్య అన్నారు. గురువారం అంబేద్కర్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆకుకూరలు, పాలు అధికంగా తీసుకోవాలని అన్నారు. ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్ష చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగడ్డ సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ నగిత, అంగన్వాడీ టీచర్ స్వర్ణ, జ్యోతి, వినోద తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు నివాళి

నాగారం : విప్లవ కవి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు (తాత) ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు తడకమల్ల సంజీవ్ అన్నారు. కానూరి వెంకటేశ్వరరావు 10వ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని యానాల వీరారెడ్డి స్థూపం వద్ద వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన ఆట–పాట–మాట ద్వారా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలను చైతన్యం చేసిన నాయకుడు కానూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొమ్మగాని జాని, ఆకుల సుభాష్, మామిడి వెంకటేష్, బుర్ర శ్రీను, బుర్ర వెంకన్న, దురుసోజు సతీష్, ఈదుల పరశురాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం గొట్టిపర్తి గ్రామంలో మహిళలు ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేయగా వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని రమేష్, సోమన్న, తెడ్డు హరిబాబు, దూదిగాని లింగయ్య, మురళి, యాకయ్య, పాష, సాలయ్య, నగేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులను అందజేయాలి

మద్దిరాల: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్ దరఖాస్తుల ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో 1038 మంది ఆన్‌లైన్ చేసుకోగా ఎంపీడీఓ కార్యాలయంలో 400మంది మాత్రమే దరఖాస్తులను అందజేశారని తెలియజేశారు.

పెన్‌పహాడ్ : రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో అందించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్ ద్వారా 1552దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కానీ కార్యాలయంలో 823 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలియజేశారు. కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను అందించాలని సూచించారు.

నూతన పాలకవర్గ నియామకం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి తెలిపారు. ధర్మకర్తలుగా పంది యాదగిరి, కనుకు రేణుక, ఆకుల సోమయ్య, జెర్రిపోతుల సోమయ్య, బీరెల్లి శ్రీధర్‌రెడ్డి, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, గడ్డం కళ్యాణి నియమితులయ్యారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతో సీనియర్లు కావడంతో నియామకం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా నూతన ధర్మకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మద్దిరాల : రెడ్డిగూడెంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి గురువారం పరిశీలించా రు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గుండు వెంకన్న, పంచాయతీ కార్యదర్శి ఉమ, గ్రామస్తులు పాల్గొన్నారు.